ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
7
శుక్రవారం 11 అక్టోబరు 2024











సిరిసిల్లలో బతుకమ్మలతో ఆది శ్రీనివాస్, చైర్‌పర్సన్

రాజకీయాలకు అతీతంగా

జిల్లాను అభివృద్ధి చేస్తాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. కార్మిక, ధార్మిక జిల్లాగా విలాసిల్లుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లాను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం రాత్రి సిరిసిల్ల మానేరు తీరంలో బంగారు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ పండుగ వచ్చినా ప్రభుత్వం అధ్యాత్మికంగా శోభాయమానంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాల కొండ అరుణ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, అన్నారం శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ ఉన్నారు.

సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా వెల్ముల స్వరూపరెడ్డి

సిరిసిల్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వెల్ముల స్వరూపరెడ్డి గురువారం మార్కెట్ యార్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. స్వరూపరెడ్డితో పాటు వైస్ చైర్మన్ నేరేళ్ల నర్సయ్య, డైరెక్టర్లుగా నక్క నర్సయ్య, పొన్నాల పర్శరాములు, ఎట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అనుముల శైలజ, కల్లెపల్లి తిరుపతిరెడ్డి, గుగ్గిళ్లరాములు, దుబాల వెంకటేశం, గంగు కొండయ్య, మహ్మద్ ఖాజా మోయినోద్దీన్, అరెపల్లి బాల చందర్, చేపూరి శ్రీనివాస్, ఆడెపు జగన్నాథం బాధ్యతలు స్వీకరించారు.

పోయిరావమ్మా.. గౌరమ్మా

● జిల్లాలో వైభవంగా బతుకమ్మ వేడుకలు

● వర్షంతో మహిళల ఇబ్బందులు



సిరిసిల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో యువతి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రీ లక్ష్మీ నీ మహిమలు గౌరమ్మా.. చిత్రమై తోచునమ్మా.. గౌరమ్మా.. పార్వతీదేవివై.. పరమేశురాణివై.. శ్రీ లక్ష్మీ నీ మహిళలే గౌరమ్మ అంటూ తొమ్మిది రోజుల పాటు జిల్లాలోని పల్లెలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు బతుకమ్మ పాటలతో ప్రతిధ్వనించాయి. గురువారం పోయిరావమ్మా.. గౌరమ్మా మళ్లీ రా బతుకమ్మ అంటూ మహిళలు బతుకమ్మలను సాగనంపారు. బతుకమ్మలతో సాయంత్రం ఎంతో సంబురంగా మొదలైన కొద్దిసేపటికే మేఘాలు కమ్ముకుని దాదాపు 40 నిముషాల పాటు కుండపోతగా వర్షం పడడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం బతుకమ్మ ఘాట్ వద్ద మహిళలు వర్షానికి తడిసిపోయారు. వర్షంలోనే బతుకమ్మలను సాగనంపారు. మిగతా ప్రాంతాల్లో వర్షం తగ్గిన తర్వాత బతుకమ్మ ఆటపాటలతో మహిళలు గడిపారు. సద్దుల సంబరంతో వైభవంగా జరిగిన పూల పండుగ మురిసి పోయింది.

● జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు

సిరిసిల్లలో బతుకమ్మ ఘాట్‌తో పాటు నెహ్రూనగర్, సాయిబాబా దేవాలయం, శాంతినగర్, పద్మనగర్, బోనాల, పెద్దూర్, రగుడు, చంద్రంపేట, సర్దాపూర్, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, అధికారులు బతుకమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఆది శ్రీనివాస్

● యారన్‌డిపో ఏర్పాటు, గల్ఫ్ పరిహారంపై కృతజ్ఞతలు

వేములవాడ, అక్టోబరు 10: రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో గల సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆది శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసం జిల్లాలో పర్యటించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి త్వరలోనే రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటి స్తానని తెలిపారు. వేములవాడ కేంద్రంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు యారన్ డిపో మంజూరు చేస్తూ 50 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ఆది శ్రీనివాస్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నారై పాలసీ అమలు, గల్ఫ్‌లో మరణించిన కార్మికులకు ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లించే విధంగా విధివిధానాలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల గల్ఫ్ కార్మికుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

● పారిశ్రామిక దిగ్గజం, గొప్ప మానవతావాది రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటు అని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రతన్ టాటా మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మహా గౌరీ అలంకారంలో అమ్మవారు

● వేములవాడలో ఘనంగా నవరాత్రోత్సవాలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10: వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ దేవి నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిదవ రోజున దుర్గాష్టమి మహాగౌరీ అలంకారములో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.


సంఘ భవనానికి నిధులు మంజూరు చేయండి


ఇల్లంతకుంట, అక్టోబరు 10: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలోని శాలివాహన సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సంఘ నాయకులు గురువారం కరీంనగర్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిమ్మనగొట్టు శ్రీనివాస్, నాంపెల్లి బాలయ్య, గంగాధర కిష్టయ్య, మద్దికుంట రాంచంద్రం, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో గ్రామాల అభివృద్ధి

గంభీరావుపేట, అక్టోబర్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అన్ని రంగాల్లో అబివృద్ధి చెందుతున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ అన్నారు. గంభీరావుపేటలో గురువారం ఎస్డీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన రూ.10 లక్షల విలువ గల హైమాస్ట్ లైట్లను ఈ సందర్భంగా హమీద్ ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ-తిరుపతి, వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, ప్రభాకర్, లింగం, గంగాధర్ తదితరులు ఉన్నారు.



















పండుగల నిర్వహణలో పరిశ్రమల భాగస్వామ్యం

ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కార్పొరేషన్‌కు ఊరట

కోల్‌సిటీ, అక్టోబరు 10: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గతంలో పరిశ్రమలే పండులు,ఉత్సవాలు నిర్వహించేవి. రానురాను బాధ్యతల నుంచి తప్పుకున్నాయి. ఈ పరిస్థితుల్లో రామగుండం నగరపాలక సంస్థ పండుగల నిర్వహణ నెత్తిన పెట్టుకుంది. సమ్మక్క-సారలమ్మ జాతర, గణపతి నిమజ్జనం, బతుకమ్మ, దసరా ఉత్సవాల పేర రూ.2కోట్ల నుంచి రూ.2.5కోట్ల వ్యయం అయ్యేది. ఈ ఉత్సవాలు కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధుల దొంగ బిల్లులకు వేదికయ్యాయి. ఒక సంవత్సరం సమ్మక్క - సారలమ్మ జాతర ఏర్పాట్ల కార్పొరేషన్‌లో రూ.1.12కోట్లు బిల్లులు డ్రా అయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జాతర అయిన ఏడాదికి కూడా బిల్లులు డ్రా చేసి తీసుకున్నారు. ఇక గణపతి ఉత్సవాల పేర రూ.30లక్షలు, సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల పేర రూ.40లక్షల నుంచి రూ.60లక్షల వ్యయం చేసేవారు. కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంలో ఉండడంతో సిబ్బందికి వేతనాలు ఇవ్వడమే గగనంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఉత్సవాలు పరిశ్రమల ఆధ్వర్యంలో జరుగాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రతిపాదనలు చేసి భాగస్వాములను చేశారు. సమ్మక్క-సారలమ్మ జాతర పూర్తిగా సింగరేణి ఆధ్వర్యంలో జరిగింది. అలాగే గణపతి నవరాత్రులకు కూడా మున్సిపల్ కార్పొరేషన్ కేవలం భోజనాల ఖర్చులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రూ.40లక్షల వ్యయం నుంచి రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వ్యయానికి కుదించబడింది. ఇక బతుకమ్మ, దసరా ఉత్సవాల పేర కార్పొరేషన్‌కు రూ.40లక్షల నుంచి రూ.60లక్షల వ్యయం అయ్యేది. ఈసారి సింగరేణిని భాగస్వామ్యం చేశారు. ఎన్‌టీపీసీ సంస్థ కూడా ఎమ్మెల్యే ఆదేశాలతో రూ.25లక్షలు భరించేందుకు ముందుకు వచ్చింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను కూడా భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే సూచించారు.ఉత్సవాల పేరుమీదే రూ.2కోట్లకు పైగా కార్పొరేషన్ ఖజానాపై భారం తగ్గింది. కార్మికుల రెండునెలల వేతనాలకు మార్గం సుగమమం అయ్యింది.


గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల కిట్‌ను అందజేస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్

కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన కల్పించాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ రూరల్, అక్టోబరు 10 : గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం (సెఫ్టీ మోకుల)పై అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని రామగుండం బైపాస్ రోడ్డులో గల రేణుకా ఎల్లమ్మ ఆలయం ఫంక్షన్ హాల్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి గీత కార్మికులకు రక్షణ కవచాలను పంపిణీ చేశారు. అనంతరం సెఫ్టీ మోకుల పనితీరుపై గీత కార్మికులు చెట్టుఎక్కి అవగాహన కల్పించగా ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల రక్షణగా ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన వారితో సాంకేతికంగా ఎన్ఐటీ అప్రూవల్ జరిగిన కాటమయ్య సేఫ్టీ కిట్లను అందజేస్తామని తెలిపారు. 15వందల కిలోల బరువులను కూడా తట్టుకునే విధంగా ఈ సెఫ్టీకిట్ తయారు చేయడం జరిగిందన్నారు. మొదటి దశలో హైదరాబాద్ మినహా వంద నియోజకవర్గాల్లో పదివేల కిట్లను ఇస్తామన్నారు. రిజిస్టర్ అయిన 2లక్షల మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇక్కడ ఉన్న డంప్ యార్డును తీసేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఇక్కడే మానేరు టూరిజం అభివృద్ధి జరగాలని, ఎల్లమ్మ తల్లి బిడ్డగా ఈ భూమిని కాపాడే బాధ్యత తనదేనని తెలిపారు. హుస్నాబాద్, మానకొండూర్ నియోజకవర్గాలకు యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు వచ్చాయని ఒక్కొకటి 180కోట్లతో భవనాలు నిర్మాణం, మౌళిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమెలా సత్పతి, ఆర్డీవో మహేష్, ఎక్సైజ్, బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు మూడు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

● మానకొండూర్, హుస్నాబాద్, మంథనిలో ఏర్పాటు
● నేడు భూమి పూజ చేయనున్న మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు

కరీంనగర్, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు దసరా కానుకను ప్రకటించింది. ఉమ్మడిజిల్లా పరిధిలోని మానకొండూర్, హుస్నాబాద్, మంథని కేంద్రంగా మూడు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నెలకొల్పాలని నిర్ణయించి మంజూరు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఐదువేల కోట్లతో 28 నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ఈ పాఠశాలలు మంజూరయ్యాయి. మానకొండూర్ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ మండలం యాదవులపల్లి శివారులో ఉన్న 20 ఎకరాల ఎస్సారెస్పీ భూమిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించనున్నారు. రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ ఈ స్కూల్ భవన నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. మంథని మండలంలోని అడవి సోమనపల్లిలో 25 ఎకరాల స్థలంలో నెలకొల్పనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేస్తారు. హుస్నాబాద్‌లో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుడతారు. ఒక్కో పాఠ శాలకు 300 కోట్ల రూపాయలు వెచ్చించనున్నట్లు సమాచారం. మానకొండూర్‌లో జరిగే కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతో పాటు కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ తదితర అధికారులు పాల్గొంటారు.


తిమ్మాపూర్ మండలం యాదవులపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి

సీఎంకు కృతజ్ఞతలు

తిమ్మాపూర్ : మానకొండూర్ నియోజకవర్గానికి దసరా సందర్భంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం మండలంలోని యాదవుల పల్లి శివారులోని ఎస్సారెస్పీ భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం యాదవ పల్లిలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి తాను శంకుస్థాపన చేస్తానని చెప్పారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, సహ కరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మం త్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలె క్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

వీణవంక, అక్టోబరు 10 : మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన ఆకుల తిరుప(30) ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. భర్త రాములు తనపై అనుమానం పెంచుకుని శారీరకంగా వేధిస్తున్నాడని జీవితంపై విరక్తి పుట్టి 12 రోజుల క్రితం ఎలుకల మందు తాగింది. గమనించిన భర్త రాములు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. తిరుప తల్లి ఇడుముల వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు..

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 10 : పట్టణంలోని వెంకట్రావ్‌పేట శివారులోని గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన హోంగార్డు ఓంకారం సుబ్బ రాజు(43) మృతిచెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుబ్బ రాజు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేష న్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఇంటికి వచ్చి ఉదయం పట్టణ శివారులో టిఫిన్ చేసేందుకు వెళ్లి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వస్తున్న నిజామాబాద్ డిపోకు చెందిన టీఎస్16యూసీ9963 నెంబర్‌గల బస్సు వెనుకనుంచి వచ్చి బైక్‌ను ఢీకొనడంతో సుబ్బరాజుకు తీవ్రగాయలై అక్కడిక క్కడే మృతి చెందాడు. సుబ్బరాజుకు ముగ్గురు కొడుకులు, కూతురు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఒకరి మృతి

● ముగ్గురికి గాయాలు


లచ్చిరెడ్డి (ఫైల్)

బోయినపల్లి, అక్టోబరు 10 : బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో గురువారం తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వ్యవసాయపనుల నిమిత్తం పొలాలకు వెళ్లిన రైతులపై అక్కడ చెట్టుకు ఉన్న తేనెపట్టుపై కొమ్మ విరిగి పడటంతో ఒక్కసారిగా తేనెటీగలు లేచి అక్కడే ఉన్న నలుగురిపై దాడి చేసాయి. తీవ్రగాయాల పాలైన వారిని వేములవాడ ఆసు పత్రికి తీసుకెళ్లగా అప్పటికే కందాడి లచ్చిరెడ్డి (60) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మరో ముగ్గురు అల్లూరి రవీందర్‌రెడ్డి, కందాడి నవీన్‌రెడ్డి, నేమల రాజిరెడ్డి చికిత్స పొందుతున్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి పెయింటింగ్ కార్మికుడి మృతి

ఓదెల, అక్టోబరు 10 : మండలంలోని కొలనూర్‌లో గురువారం పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడడంతో కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగులమల్యాలకు చెందిన మేక రవీందర్(37) మృతిచెందాడు. పెయింటింగ్ వేస్తూ జీవించే రవీందర్ కొద్ది రోజుల నుంచి కొలనూర్‌కు చెందిన ఒక వ్యక్తి భవనానికి పెయింటింగ్ వేస్తున్నాడు. రక్షణ కోసం కట్టుకున్న జూలతాడు అకస్మాత్తుగా తెగిపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అతడిని కరీంనగర్ ఆసు పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ


మల్లాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మల్లాపూర్, అక్టోబరు, 10 : దసరా దుర్గా శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం మల్లాపూర్‌లో పలువురు వైశ్యులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన కూడలి నుంచి అమ్మవారి దేవాలయం వరకు నెత్తిన బోనంతో పలువురు వైశ్యులు శోభాయాత్ర జరిపారు. అనంతరం దుర్గా దేవికి భక్తి శ్రద్ధలతో బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో సమం నాయకులు శివ శ్రీనివాస్, చౌదారపు శ్రీనివాస్, మేడి రాజేష్, మనోహర్, సంగేమ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎనిమిదో రోజు దేవీ నవరాత్రోత్సవాలు

● మహాగౌరీ రూపంలో దర్శనం ఇచ్చిన అమ్మవారలు ● హంస వాహనంపై శ్రీ యోగ, ఉగ్ర స్వామి ఊరేగింపు


హంస వాహనంపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారల సేవలు ఊరేగింపు

ధర్మపురి, అక్టోబరు 10 : ధర్మపురి రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు ఎనిమిదవ రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ రోజు అమ్మవారలు తెలుపు వర్ణ వస్త్రధా రణలో మహాగౌరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శించుకున్నారు. సాయంత్రం యోగ, ఉగ్రనరసింహ స్వామివారల సేవలు హంస వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం అమ్మవారలకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రుత్వికులు అరుణ్‌కుమార్, రాజగోపాల్, పాలెపు సందీప్ శర్మ పాల్గొన్నారు.


ధర్మపురిలో ..


కోరుట్లలో ..

సింహవాహనంపై స్వామి దర్శనం

కోరుట్ల/కోరుట్ల రూరల్ అక్టోబరు 10 : శరన్నవరాత్సోవాల్లో భాగంగా కోరుట్ల అష్టలక్ష్మి దేవాలయంలో స్వామి వారు గజ వాహనం, వెంకటేశ్వర స్వామి దేవాయాలలో స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు గ్రామాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ రావు వేరువేరుగా ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

జగిత్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం గురువారం కొనసాగింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి 11,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 11,590 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంజన్న ఉద్యోగులకు పదోన్నతి

మల్యాల, అక్టోబరు 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులకు దేవాదాయశాఖ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ఎర్రం భూపతిరెడ్డికి పర్యవేక్షకులకు పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా గురువారం ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ప్రధానర్చకులు జితేంద్రప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ శాలువతో సత్కరించారు. ఇద్దరికి పదోన్నతి లభించడంతో కొండగట్టు దేవస్థానంలో పర్యవేక్షకుల సంఖ్య అయిదుగురికి చేరింది.





'ఇందిరా మహిళా శక్తి' లక్ష్యం చేరుకోవాలి

● పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాన్ని చేరుకోవాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు, ఇందిరా మహిళా శక్తి పథకం అమలు తీరుపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓలు, మెప్మా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యక్తిగత, గ్రూప్‌ల వారీగా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని వెల్లడించారు. ఆయా యూనిట్స్ ఏర్పాటుపై మహిళా సంఘాల బాధ్యులతో మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినెలా టార్గెట్ నిర్ణయించి, ముందుకు వెళ్లాలని ఆదేశించారు. జిల్లాలో వ్యక్తిగత ఇందిరా మహిళా శక్తి యూనిట్ల లక్ష్యం 179, రుణం రూ 6.26 కోట్లు కాగా, ఇప్పటిదాకా 95 యూనిట్స్ గ్రౌండింగ్ అయ్యాయని, రూ 1.41 కోట్ల రుణాలు అందించామని, గ్రూప్ యూనిట్ల లక్ష్యం 30, రుణం రూ.6 కోట్లు కాగా, మూడు యూనిట్లకు రూ.16 లక్షలతో ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వివరించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ల పరిష్కారానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్‌రెడ్డి, ఇంచార్జ్ డీపీఓ శేషాద్రి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబరు 10: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి వైద్య చికిత్స కోసం గురువారం ప్రభుత్వం తరఫున ఎల్ఓసీలు అందజేసినట్లు తెలిపారు. సుమారు 12 లక్షల రూపాయల మేరకు చికిత్స అందించడానికి ఒకే రోజు ఎల్ఓసీ అందజేసినట్లు ఆయన వెల్లడించారు. గత వారం క్రితం ఒకే రోజు 11 లక్షల విలువ గల 5 ఎల్ఓసీలు అందజేశామన్నారు.





జోరుగా జిల్లా ఆర్య వైశ్య మహాసభ ఎన్నికల ప్రచారం

వేములవాడ, అక్టోబర్ 10 : జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఆర్యవైశ్య సంఘంలో అత్యంత కీలకమైన జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఇద్దరు ప్రముఖులు తీవ్రంగా పోటీపడుతున్నారు. ఆనవాయితీ ప్రకారం ఈసారి జిల్లా మహాసభ అధ్యక్ష పదవిని వేములవాడకు కేటాయించడంతో వేములవాడకు చెందిన సీనియర్ నాయకులు బుస్స దశరథం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కట్కూరి శ్రీనివాస్ బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరగనున్న క్రమంలో ఓటర్లను ఆకట్టుకు నేందుకు ఇద్దరు అభ్యర్థులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నా రు. ఆర్యవైశ్య సంఘంలో ప్రతి 25 మంది సభ్యుల్లో ఒకరికి ఓటరుగా అవకాశం ఇచ్చే పద్ధతి ప్రకారం జిల్లావ్యాప్తంగా మొత్తం 142 మంది ఓటర్లు అధ్యక్ష స్థానానికి ఎన్నికల్లో ఓటు వినియో గించుకోనున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల ప్రలోభాలకు తెరలేపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. తనను గెలిపించాలంటూ ఇద్దరు అభ్యర్థులు రాజకీయ ప్రముఖులను కలిసి సైతం కోరుతున్నారు.

యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

రుద్రంగి, అక్టోబరు 10: యువత మత్తు వదిలి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్సై భూక్య రాంరెడ్డినాయక్ అన్నారు. గురువారం రుద్రంగి మండలం బడితండా గ్రామంలో నిర్వహించిన హాఫ్ మారథాన్ కార్యక్రమానికి ఎస్సై భూక్య రాంరెడ్డినాయక్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం, మంచి జీవితం, డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో హాఫ్ మారాథాన్‌లో 5కే రన్, 100 మీటర్లు, 500 మీటర్లు నిర్వహించడం జరుగిందన్నారు. గంజాయి,మత్తు పదార్థాలను నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా బాగా చదువుకోవాలన్నారు.



వైభవంగా సద్దుల బతుకమ్మ



గొల్లపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 10: సద్దుల బతుకమ్మ వేడుకలు సిరిసిల్ల అర్బన్‌లోని అన్ని గ్రామాల్లో సంబరంగా సాగాయి. చంద్రంపేట రగుడు, పెద్దూర్, సర్ధాపూర్, చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లి రాజీవ్‌నగర్ ప్రధాన కూడళ్లలో మహిళలు బతుకమ్మలను పెట్టి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. అలాగే యువతులు దాండియా ఆటలు ఆడి గ్రామ శివారులోని చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు.

● ఇల్లంతకుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల సమీపంలోని బతుకమ్మ తెప్పల వద్ద బతుకమ్మలను ఉంచి ఆడుకున్నారు. బతుకమ్మల నిమజ్జనం అనంతరం ఒకరికొకరు వాయినాలు పంచుకున్నారు.అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● తంగళ్లపల్లి : మండలంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. బతుకమ్మ పాటలు.. కోలాటలు, బతుకమ్మ ఆటలతో మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చెరువులు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేసి ఒకరికొకరు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. అనంతరం గ్రామ సమీప చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

● ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు, నామాపూర్, గూడెం, ఆవునూర్, పోతుగల్, బందనకల్, మద్దికుంట, మోయినికుంట తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తంగెడు, గునుక పూలతో బతుకమ్మలు పేర్చి ప్రధాన కూడళ్లలో బతుకమ్మ ఆటలను మహిళలు ఆడారు.

● వేములవాడ టౌన్: వేములవాడ అర్బన్ మండలంతో పాటు విలీన గ్రామాల్లో గురువారం బతుకమ్మ వేడుకలను మహిళలు కన్నులపండగగా జరుపుకున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి, అయ్యోరుపల్లి గ్రామాల్లో మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను చేశారు.

● ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, తిమ్మాపూర్, గుండారం, అక్కపల్లి, దుమాల, కోరుట్లపేట, సింగారం, పదిర, హరిదాస్‌నగర్, తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు గురువారం అంబరాన్నంటాయి. గొల్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోగూరి శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై అభిమానంతో బతుకమ్మపై సీఎం చిత్ర రూపాన్ని గ్రామంలోని కళాకారుడు అందె దేవయ్యతో వేయించారు.

● కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మలతో మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య వెళ్లి ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● చందుర్తి: చందుర్తి మండలంలో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరిగాయి. చందుర్తిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని బతుకమ్మ నిమజ్జనం చేశారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ పాల్గొన్నారు.

● రుద్రంగి: రుద్రంగి మండలం మానాల గ్రామంలో గురువారం ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరిగాయి. గ్రామంలోని ప్రధాన చౌరస్తాల వద్ద బతుకమ్మలు పెట్టి ఆడి పాడారు.

కొలువుదీరిన బొప్పాపూర్ ఏఎంసీ పాలకవర్గం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 10: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగి వారి అభ్యున్నతికి పాటు పడుతామని బొప్పాపూర్ ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంగౌస్ అన్నారు.ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని మార్కెటు కమిటీ కార్యాలయంలో గురువారం నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంగౌస్ మాట్లాడుతూ అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా కొమిరిశెట్టి విజయ-తిరుపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మెన్‌తో పాటు డైరెక్టర్లు బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



